నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 18 డిసెంబర్ 2024 | HYDERABAD

## వెబ్ సైట్‌లో జీహెచ్ఎంసీ సమాచారం అప్‌డేట్

### ఐటీ అధికారుల లోపాలను ఎత్తిచూపిన 'నమస్తే'

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ): తెలంగాణ స్టేట్ పోర్టల్ వెబ్‌సైట్‌ను ఎట్టకేలకు అధికారులు అప్‌డేట్ చేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) పరిధిలోని జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న ఉన్నతాధికారుల పేర్లను గల్లంతు చేయడం, పోర్టల్ ప్రకారం రెండేళ్ల క్రితం బదిలీ అయిన సీనియర్ ఐపీఎస్, ఐఏఎస్‌లతో పాటు ఉన్నతాధికారులు జీహెచ్ఎంసీలోనే పనిచేస్తున్నట్లు చూపించారు. ఐటీ అధికారుల లోపాలను ఎత్తిచూపుతూ మంగళవారం 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీనిపై స్పందించిన ఐటీ విభాగం జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల వివరాలను అప్‌డేట్ చేశారు.



మూసీ పరిధిలో ప్రభుత్వం కూల్చివేయించిన ఓ ఇల్లు..

## జూలై తర్వాత అక్రమ నిర్మాణాలుంటే

# కూల్చేస్తాం

### చెరువుల ఆక్రమణలపై కీలక ప్రకటన చేసిన హైడ్రా కమిషనర్ రంగనాథ్

సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): జూలై తర్వాత కడుతున్న నిర్మాణాల్లో అక్రమమని తేలితే కూల్చేయడం తప్పదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ఏర్పాటు తర్వాత అక్రమంగా నిర్మించిన ఇండ్లపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. మంగళవారం కూకట్‌పల్లిలోని కాముని చెరువు, మైసమ్మ చెరువులను స్థానికుల ఫిర్యాదు మేరకు కమిషనర్ రంగనాథ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కూకట్‌పల్లి మండలంలోని కాముని చెరువులో నిర్మాణ వ్యర్థాలు, మట్టిని తీసుకొచ్చి చెరువును కబ్జా చేస్తున్నారని అందిన ఫిర్యాదుల మేరకు చెరువులను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. జూలై 2024 తర్వాత నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను కచ్చితంగా కూల్చేస్తామని చెప్పారు. గతంలో ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకుని ఇప్పుడు నిర్మిస్తున్న నిర్మాణాల జోలికి కూడా వెళ్లమని, అయితే ఎలాంటి పర్మిషన్స్ లేకుండా కడుతున్న నిర్మాణాలను మాత్రం కూల్చేస్తామని స్పష్టం చేశారు. హైడ్రా ఏర్పాటు తదనంతరం నిర్మించిన అక్రమ నిర్మాణాలను గూగుల్ మ్యాప్‌ల ద్వారా గుర్తించి కూలుస్తామన్నారు. అలాగే ఇటీవల తీసుకున్న అనుమతులను కూడా హైడ్రా పరిశీలిస్తుందని, వాటిలో లోపాలుంటే ఆయా నిర్మాణాలను అడ్డుకుంటామని వెల్లడించారు. కాముని చెరువులో మట్టిని పోసి చెరువును కబ్జా చేసేందుకు యత్నించిన వారిపై చట్టరీత్యా చర్యలుంటాయని తెలిపారు. చెరువులు, ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టడం తగదని, ఆ నిర్మాణాలను గుర్తించి కూల్చివేస్తామన్నారు. హైడ్రా ఏర్పాటుకు ముందు నిర్మించిన నిర్మాణాల జోలికి వెళ్లబోమని, వాటిని కూల్చేది లేదని ఆయన స్పష్టం చేశారు. కానీ, ఈ నిబంధన వాణిజ్య సముదాయాలకు వర్తించదన్నారు. చెరువుల సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ అధికారులను రంగనాథ్ ఆదేశించారు. చెరువుల ఆక్రమణలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు పాల్పడిన వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాముని చెరువులో వెలిసిన రాఘవేంద్ర కాలనీలో పాత ఇండ్లపై చర్యలు ఉండవని, ఇటీవలే కొందరూ అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలపై చర్యలు ఉంటాయన్నారు. చెరువును కాపాడుకునేందుకు కాలనీ వాసులు సంఘటితం కావాలని సూచించారు. చెరువు కబ్జాలపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసి, ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించాలన్నారు. కాముని చెరువు, మైసమ్మ చెరువు పరిసరాల్లోని నివాసితులు చెరువులు కబ్జా కాకుండా చూడాలని స్థానికులను కోరారు.


వాసవి నిర్మాణ సంస్థ చేయాల్సిన వరదనీటి కాలువ పనులను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆయా విభాగాల అధికారులు

# చెరువుకు చెర!!

- కాముని, మైసమ్మ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో బడా నిర్మాణాలు
- వాసవికి వాత పెట్టాలని 'హైడ్రా'కు స్థానికుల ఫిర్యాదు
- వాసవి సరోవర్ నిర్మాణంపై కమిషనర్ రంగనాథ్ క్షుణ్ణంగా పరిశీలన
- వరద నీటి కాలువ పనులపై తీవ్ర ఆగ్రహం
- హైడ్రా తదుపరి చర్యలపై సర్వత్రా ఉత్కంఠ

సిటీబ్యూరో/ కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ) : రియల్ వ్యాపారంతో ధన దాహన్ని తీర్చుకుంటున్న వాసవి సంస్థపై హైడ్రా దృష్టి సారించిందా? త్వరలోనే వాసవికి హైడ్రా వాత పెట్టనుందా? కూకట్‌పల్లిలోని కాముని, మైసమ్మ చెరువును కబలిస్తూ వాసవి సరోవర్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మంగళవారం అధికారులు, స్థానిక ప్రజలతో కలిసి కాముని, మైసమ్మ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ప్రాంతాల్లో పర్యటించారు. వాసవీ నిర్మాణ సంస్థ కాముని చెరువు నుంచి మైసమ్మ చెరువుకు వెళ్లే వరదనీటి కాలువను మళ్లించడంతో దిగువన ఉన్న సప్తార్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్ బస్తీలు వర్షాకాలంలో మునిగిపోయాయని స్థానికుల ఫిర్యాదు మేరకు.. వాసవీ నిర్మాణ సంస్థలో వరదనీటి కాలువ నిర్మాణ పనులను అధికారులు పరిశీలించారు. వాసవీ సరోవర్ నిర్మాణ సంస్థ నిబంధనల ప్రకారం 17 మీటర్ల వెడల్పుతో వరదనీటి కాలువ నిర్మాణ పనులు పూర్తి చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశించారు. నిబంధనల ప్రకారం వాసవీ నిర్మాణ సంస్థ ముందుగా వరదనీటి కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని, ఆ కాలువ పనులు చేయకుండానే నిర్మాణ పనులు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వాసవి సరోవర్‌పై హైడ్రా ఏ విధంగా చర్యలు తీసుకుంటుందోనన్న ఆసక్తికర చర్చ జరుగుతుంది. కాముని, మైసమ్మ చెరువులు బడా నిర్మాణ సంస్థలో చేతిలో పడి కనిపించకుండా పోతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేయడం, మైసమ్మ చెరువు మరోసారి వార్తల్లోకి ఎక్కింది.

### 227 ఎకరాలకు.. మిగిలింది 83 ఎకరాలే..

కూకట్‌పల్లి మండలంలోని మైసమ్మ చెరువు రెవెన్యూ రికార్డుల ప్రకారం... ప్రైవేట్, ప్రభుత్వ భూములను కలుపుకుని 227 ఎకరాలుండగా.. ప్రస్తుతం 83 ఎకరాలు మాత్రమే కనిపిస్తుంది. కూకట్‌పల్లి గ్రామ పరిధిలోని ప్రభుత్వ సర్వే నం.893లో 84.2 ఎకరాల శిఖం భూమి ఉండగా, ఎఫ్‌టీఎల్ పరిధిలో మిగిలిన పట్టా భూములు 906, 907, 905, 903, 902, 901, 904, 900, 899, 898, 896, 892ఏ, 892ఏఏ, 894, 895. మూసాపేట గ్రామం పరిధిలో 71,72, 70, 63, 64,65, 66, 59, 58, 57,56, 50,49,48,47, 46ఏ,బీ, సీ,డీలు, 45,44, 43,42, 40,41, 92, 93,94, 95, 96, 97,98, 104,105,,107,108, 103, అల్లాపూర్ పరిధిలో 50, 51,52 సర్వే నంబర్లు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి ఉన్నాయి. సర్వే నం. 49,50,51, 52, 54,56, 57,64, 66, 69, 73,74, 99, 102, 103, 104, 892 బఫర్ జోన్ పరిధిలోకి వస్తాయి. ఇందులో ఎఫ్‌టీఎల్‌లో 182.10 ఎకరాలు బఫర్ జోన్‌లో 45.12 ఎకరాలున్నట్లు రికార్డుల్లో నమోదైంది.

### నాలా కన్వర్షన్ లేకుండానే అడ్డదారిలో అనుమతి..

వాసవి నిర్మాణ సంస్థ 2023లో జీహెచ్ఎంసీ నుంచి అనుమతులు తీసుకుని 11 బ్లాక్‌లుగా 29 అంతస్తులలో నిర్మాణ పనులను ప్రారంభించింది. వాసవి నిర్మాణ సంస్థ అనుమతులు పొందిన సర్వే నంబర్లు.. 50, 51, 52,70,66,57, 56,50, 49లలోని 10.59 ఎకరాల భూమి ఎఫ్‌టీఎల్ పరిధిలోకి రాగా... సర్వే నం.49,52, 54,56, 56,57,99 లలోని 16.51 ఎకరాల స్థలం బఫర్ జోన్ పరిధిలో ఉంది. కాగా, వాసవి నిర్మాణ సంస్థ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో 27.1 ఎకరాలు కూడా ఉంది. ఈ స్థలంలో 2.30 ఎకరాల బఫర్ జోన్‌ను వదిలామని నిర్మాణ సంస్థ చెబుతున్నది. కానీ... మిగిలిన స్థలంలో కూడా బఫర్‌జోన్ ఉందని స్థానికంగా ఆరోపణలు ఉన్నాయి. ఈ అనుమతులు పొందిన స్థలానికి చెందిన సర్వే నంబర్లు ఇప్పటికి వ్యవసాయ భూమిగానే ధరణీ పోర్టల్‌లో కనిపిస్తుందని, నాలా కన్వర్షన్ చేయకున్నా... ఆ నిర్మాణ సంస్థ అడ్డదారిలో అనుమతులు తీసుకువచ్చిందని స్థానికులు చెబుతున్నారు.

### కృత్రిమ నాలాతో కాలనీ వాసుల ఆందోళన..

కూకట్‌పల్లి మండలంలో గొలుసుకట్టు చెరువులుగా ముళ్లకత్వ చెరువు, కాముని చెరువు, మైసమ్మ చెరువులు కనిపిస్తాయి. ఒక చెరువు నుంచి వచ్చే వరదనీరు కింది చెరువుకు వెళ్లేలా సహజసిద్ధ కాలువలు ఉన్నాయి. ఇలా కాముని చెరువు అలుగు నుంచి వెళ్లే వరదనీరు మైసమ్మ చెరువుకు చేరుకుంటుంది. సహజంగా వెళ్లే ఈ వరదనీటి కాలువను వాసవి నిర్మాణ సంస్థ మళ్లించేందుకు అనుమతులు పొందింది. 17 మీటర్ల వెడల్పుతో 2.8 మీటర్ల లోతుతో కృత్రిమంగా వరదనీటి కాలువను నిర్మించడానికి అనుమతి తీసుకున్నారు. సహజంగా వెళ్లే వరదనీటిని జడ్ ఆకారంలో ఆర్‌సీసీ గోడలను నిర్మించి కృత్రిమంగా నాలాను ఏర్పాటు చేయనున్నారు. సహజంగా వెళ్లే వరదనీటిని మళ్లించి కృత్రిమంగా తయారు చేసిన కాలువలో వరదనీటిని పంపించడం వల్ల సమీపంలోని కాలనీలు, బస్తీలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మైసమ్మ చెరువులో సుందరీకణ పనులను వాసవీ నిర్మాణ సంస్థకు.. సీఎస్‌ఆర్‌లో భాగంగా జీహెచ్ఎంసీ అప్పగించిందని, ఈ ముసుగులో సదరు సంస్థ కబ్జాకు పాల్పడుతుందని స్థానికులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వివరించారు. నాలా ప్రస్తుతం ఆరు నుంచి 7 మీటర్లు ( ఆరు ఫీట్ల నుంచి 22 ఫీట్లు) వెడల్పు మాత్రమే ఉందని ఈ సుందరీకణ పనులతో స్థానికంగా ఉన్నటువంటి రాజీవ్‌గాంధీనగర్, సప్తార్‌నగర్ కాలనీలు వరదనీటిలో మునిగిపోతాయని ఆ కాలనీలకు చెందిన ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## మేం కూల్చలే.. వాళ్లే కూల్చుకున్నారు

- అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు ప్రకటన
- బలవంతంగా ఖాళీ చేయించి.. లేబర్లను పెట్టి కూల్చివేసి
- మూసీ నిర్వాసితుల బాధను పట్టించుకోని సర్కార్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మూసీ బాధితులు



సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ) : ''గూడు కూల్చొద్దంటూ అధికారుల కాళ్లవేళ్ల పడి బతిమిలాడినా ఆ అభాగ్యుల రోదన వట్టిదేనా? కష్టపడి కట్టుకున్నాం కూల్చొద్దు సారూ అంటూ వేడుకున్న ఓ వృద్ధురాలి కన్నీటి వ్యథలో నిజం లేదా? తమది ఉమ్మడి కుటుంబం..ఈ ఇల్లు ఒక్కటే ఆధారం.. మీరు కూలగొడితే తమ కుటుంబం చెల్లాచెదురవుతుందని చేతులు జోడించిన ఫాతిమా బేగం పడిన ఘోస అబద్ధమా? ఓ వైపు ఇల్లు కూలగొడుతుంటే మరోవైపు ఇటుక ముక్కలు, రాళ్లతో ఇల్లు నిర్మిస్తున్న ఇద్దరు చిన్నారులు చేసిన ప్రయత్నం అంతా అబద్ధమా?'' మూసీ వెంట ఏండ్ల నుంచి నివాసం ఉంటున్న నిర్వాసితులను బలవంతంగా ఖాళీ చేయించి.. వారి ఇండ్లను కూల్చివేసిన సర్కార్ ఇప్పుడు మరో రాగం ఎత్తుకుంది.

నిర్వాసితుల ఇండ్లను తాము కూల్చలేదని.. వాళ్లంతట వాళ్లే కూల్చివేసుకున్నారని మంత్రి శ్రీధర్ బాబు అసెంబ్లీలో ప్రకటించడంపై నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూసీని ఆనుకుని ఉన్న నాగోల్, రామంతాపూర్, చైతన్యపురి, సైదాబాద్, అంబర్‌పేట తదితర మూసీ ప్రాంతాల్లో మహిళలు తమ ఇండ్లను కూల్చొద్దని చేసిన ర్యాలీలు, నిరసనలు, బతుకమ్మ రూపంలో తెలిపిన ఆందోళనలన్నీ మంత్రికి కనిపించ లేదేమోనని విమర్శించారు. '' గుంపు మేస్త్రీ పాలన ఉయ్యాలో గుదిబండ తీరాయే ఉయ్యాలో.. పేదల బతుకుల్లో ఉయ్యాలో.. చీకటి నింపిండు ఉయ్యాలో.. గూడు చెదిరిపాయే ఉయ్యాలో.. గుండెలవిసి పాయే ఉయ్యాలో.. కాంగ్రెస్ రేవంత్ ఉయ్యాలో.. కాలయ ముద్దైపాయే ఉయ్యాలో..' అంటూ పాడుతూ నిరసన వ్యక్తం చేసిన పాటలు సైతం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. సైదాబాద్, మలక్‌పేట్‌లో గల్లీలు చిన్నవి కావడంతో బుల్డోజర్లు, జేసీబీలు వెళ్లలేకపోవడంతో 50 మంది లేబర్లను రంగంలోకి దించి... వాళ్లంతా సుత్తెలు, గడ్డపారలు తదితర సామగ్రిని ఉపయోగించి గోడలను, కప్పులను భూస్థాపితం చేశారు. తమ కండ్ల ముందే ఇండ్లు కూలిపోవడాన్ని చూసిన బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. బాధితులు అడ్డుకునే ప్రయత్నం చేసినా.. పోలీసుల పహారాలో ఇండ్లను భూస్థాపితం చేశారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యలపై నిర్వాసితులు, సామాజిక సేవా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



## మీ లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదు?

### సంధ్య థియేటర్‌కు సీపీ షోకాజ్ నోటీసులు జారీ

### అల్లు అర్జున్ బెయిల్ రద్దుపై పోలీసులు సుప్రీంకు?

సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ)/బేగంపేట: పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా ఈ నెల 4 రాత్రి సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందిన దుర్ఘటనలో హైదరాబాద్ పోలీసులు థియేటర్ యజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 'మీ లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదో 10 రోజుల్లో వివరణ ఇవ్వండి' అంటూ.. థియేటర్ యజమాని రేణుకా దేవికి హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ నోటీసుల్లో పేర్కొన్నారు.

### బెయిల్ రద్దు కోసం సుప్రీంకు?

తొక్కిసలాట ఘటనపై పోలీసులు విరుద్ధమైన వాదలను వినిపించారు. థియేటర్ యాజమాన్యం అనుమతి తీసుకోలేదని మొదట చెప్పిన పోలీసులు... ఆ తర్వాత మాట మార్చారు. దరఖాస్తు చేశారు కానీ పోలీసు అధికారులకు ఈవెంట్ గురించి వివరించలేదని చెప్పారు. పోలీసులు తమకు అనుమతి ఇచ్చారంటూ సంధ్య థియేటర్ యాజమాన్యం వద్ద ఉన్న లేఖ సోషల్‌మీడియాలో కనిపించగా ఈ విషయంపై కూడా మరోసారి మాట మార్చారు. ఆ లేఖను కార్యాలయంలో ఇచ్చి వెళ్లారు కానీ సంబంధిత అధికారిని ఎవరినీ కలవలేదని పోలీసులు మరో వాదన వినిపిస్తున్నారు. ఇదిలా ఉండగా సినీ నటుడు అల్లు అర్జున్‌కు హైకోర్టు మంజూరు చేసిన మధ్యంతర బెయిల్‌ను రద్దు చేయించేందుకు, సుప్రీంకోర్టులో అప్పీల్ చేయాలని పోలీసులు యోచిస్తున్నట్టు సమాచారం. ఇందుకు గల కారణాలు ఏమిటో స్పష్టంగా తెలియరాలేదు. తొక్కిసలాటకు ఘటనలో తమకు ఏ సంబంధమూ లేదని తప్పించుకునేందుకే పోలీసులు సంధ్య థియేటర్‌కు నోటీసులిచ్చారని నగరవాసులు చర్చించుకుంటున్నారు. థియేటర్ వద్ద జరిగిన ఘటనలో నిర్లక్ష్యం ఎవరిది? యాజమాన్యానిదా? నటుడిదా? పోలీసులదా? అనే అంశంపై సర్వత్రా మాట్లాడుకుంటున్నారు.

### శ్రీతేజ ఆరోగ్యంపై సీపీ ఆరా..

తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్ కిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్న బాలుడు శ్రీతేజ (9)ను తెలంగాణ ప్రభుత్వ హెల్త్ సెక్రటరీ క్రిస్టీనా, సీపీ ఆనంద్ పరామర్శించారు. శ్రీ తేజ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీతేజ కోలుకోవడానికి మరింత సమయం పడుతుందని వైద్యులు తెలిపారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. త్వరలోనే శ్రీతేజ హెల్త్ బులిటెన్‌ను వైద్యులు విడుదల చేస్తారని అన్నారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని రెగ్యులర్‌గా మానిటరింగ్ చేస్తున్నామని పేర్కొన్నారు.

## అందుబాటులోకి సుందరీకరణ పనులు

సిటీబ్యూరో, డిసెంబర్ 17(నమస్తే తెలంగాణ): శేరిలింగంపల్లి జోన్ పరిధిలో పలు జంక్షన్ల అభివృద్ధి, సుందరీకరణ పనులను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. గోపన్‌పల్లిలో రాగా ఫౌండేషన్ నిర్మించిన చిన్న జంతు శ్మశానవాటికను స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కలిసి మేయర్ ప్రారంభించారు. అనంతరం జేఆర్‌సీ జంక్షన్ బ్యూటిఫికేషన్ ఆఫ్ స్కేలింగ్, స్కల్ప్చర్, ఫౌంటైన్‌లు, క్యాస్కేడ్‌లు ప్రారంభించారు. బయోడైవర్సిటీ జంక్షన్ బ్యూటిఫికేషన్, శిల్పాలు, ఫౌంటైన్, లైటింగ్‌ల అప్‌స్కేలింగ్, రోడా మిస్త్రీ కాలేజ్ కమాన్ నుంచి తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం వరకు వీధి ఫర్నిచర్‌ను మేయర్ ప్రారంభించారు. శేరిలింగంపల్లి సర్కిల్–20లోని గచ్చిబౌలి స్టేడియంలో శిల్పాలు, ఫౌంటైన్‌తో కూడిన రోటరీల అభివృద్ధి పనులు, ఖాజాగూడ జంక్షన్ బ్యూటిఫికేషన్ ఆఫ్ స్కేలింగ్ ఆఫ్ శిల్పాలు, లైటింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, ఎస్ఈ శంకర్ నాయక్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.


మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌ను అల్వాల్‌కు మార్చాలి

### మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

- నియోజక వర్గంలో బస్సుల సంఖ్యను పెంచాలి
- మంత్రులు పొంగులేటి, పొన్నంకు వినతి

మల్కాజిగిరి, డిసెంబర్ 17: ప్రజల సౌకర్యం కోసం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసును అల్వాల్‌కు మార్చాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీలోని మంత్రి కార్యాలయంలో బేగంపేట వల్లభ్‌నగర్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని అల్వాల్‌కు మార్చాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అలాగే నియోజక వర్గంలోని మచ్చ బొల్లారం, మౌలాలి, వినాయక్‌నగర్, గౌతంనగర్ డివిజన్ రూట్లలో బస్సుల సంఖ్యను పెంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. రెండు దశాబ్దాల కింద బేగంపేట వల్లభ్‌నగర్‌లో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ఏర్పాటు చేశారన్నారు. అల్వాల్‌కు సంబంధించిన అన్ని రిజిస్ట్రేషన్‌లు ఇక్కడే జరుగుతున్నాయన్నారు. ప్రజలు అల్వాల్ నుంచి బేగంపేటకు దాదాపు 10కిలో మీటర్లు వెళ్లాల్సి వస్తోందని, దీంతో మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. త్వరలోనే అల్వాల్‌కు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని రూట్లలో బస్సుల సంఖ్యను పెంచాలని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు విన్నవించగా.. సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.

## జీడిమెట్ల సరోజిని గార్డెన్‌లో

# ప్రభుత్వ భూమి కబ్జా!

### బహుళ అంతస్తుల నిర్మాణం కోసం యూఎల్‌సీ స్థలం ఆక్రమణ

- అభ్యంతరం వ్యక్తం చేసిన స్థానికులు
- యూఎల్‌సీ స్థలంలో ప్రభుత్వ బోర్డు ఏర్పాటు
- రాకపోకలకు పబ్లిక్ ఫుట్‌పాత్ ధ్వంసం చేసిన నిర్మాణదారులు

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 17: సరోజిని గార్డెన్‌లో బహుళ అంతస్తుల నిర్మాణం కోసం యూఎల్‌సీ ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశారంటూ ఫిర్యాదులు వెల్లువెత్తడంతో కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులు స్పందించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల విలేజ్ గాంధీ విగ్రహం సమీపంలోని సరోజిని గార్డెన్ సర్వే నం.48లో దాదాపుగా 5,807 గజాల విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ స్థలం(యూఎల్‌సీ) ఆక్రమణకు గురైందని స్థానికులు తెలిపారు. 1976 యూఎల్‌సీ చట్టం ప్రకారం సర్వే నం.48లో ఉన్న స్థలానికి ఓ నిర్మాణ సంస్థ నకిలీ పత్రాలను సృష్టించి తప్పుడు రిజిస్ట్రేషన్లు చేయించడంతో పాటు హెచ్ఎండీఏ నుంచి అనుమతులు పొందటం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై జిల్లా కలెక్టరేట్ కార్యాలయంతో పాటు కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో మంగళవారం కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు యూఎల్‌సీ భూమిలో ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేశారు. కాగా ఈ విషయంపై మండల తాసీల్దార్ అబ్దుల్ రెహమాన్‌ను వివరణ కోరగా.. సరోజిని గార్డెన్ సర్వే నం. 48లో యూఎల్‌సీ ప్రభుత్వ స్థలం ఉన్నది వాస్తవమేనన్నారు. ఈ మేరకు త్వరలోనే సర్వే చేపట్టి ఆ స్థలాన్ని గుర్తించి హద్దులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అప్పటి వరకు ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని నిర్మాణదారులకు సూచించినట్లు తెలిపారు.



### రాకపోకలకు జాతీయ రహదారి ఫుట్‌పాత్ ధ్వంసం..

కాగా సుచిత్ర నుంచి కొంపల్లి వైపునకు వెళ్లే ప్రధాన జాతీయ రహదారి–44కి ఆనుకొని ఉన్న ఫుట్‌పాత్‌ను సరోజిని గార్డెన్‌లో జరుగుతున్న నిర్మాణం కోసం టిప్పర్లకు ఎలాంటి అంతరాయం లేకుండా ఉండేందుకు నిర్మాణదారులు అక్రమంగా ఫుట్‌పాత్‌ను ధ్వంసం చేశారు. ఓ వైపు రోడ్డు వెడల్పు, జంక్షన్ల అభివృద్ధి పనులు జరుగుతున్న క్రమంలో అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఫుట్‌పాత్‌ను నిర్మాణదారులు తొలగించడం పట్ల స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కాగా దీనిపై అల్వాల్ ట్రాఫిక్ సీఐ నాగరాజుని వివరణ కోరగా.. ఫుట్‌పాత్ నిర్మాణం కూల్చివేతలపై తమకు ఎలాంటి సమాచారం రాలేదని, ఇష్టానుసారంగా ఫుట్‌పాత్‌లను తొలగించడం చట్టవ్యతిరేక చర్య అన్నారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని తెలిపారు.